


## 'అ ఆ' లు నేర్పిన గురుదేవులకి అక్షరాంజలి

### ఆచార్య దేవోభవ!!!

- నాగళ్ళ సుధ

**ఆచార్య దేవోభవ!!!** గురువు, మాస్టారు, టీచర్...... పేర్లు ఎన్నైనా పరమార్థం ఒక్కటే. ఎప్పుడైనా పాత జ్ఞాపకాల్లోకి వెళితే నేను తలుచుకునేది ఒక్క టీచర్ని కాదు. నాకు విద్యాబుద్ధులు, సంస్కారం నేర్పిన ఎందరో మహానుభావుల్ని.

మొట్టమొదటిగా తప్పనిసరిగా నేను చెప్పవలసింది శ్రీరామమూర్తి మాస్టారు గారి గురించి. ఎందుకంటే నాకు అ, ఆలు A B C D లు చెయ్యి పట్టి దిద్దించింది ఆయనే. 1972లో నాకు నాలుగు సంవత్సరాల వయస్సులో మాస్టారుగారు రేపల్లెలో మా ప్రక్క ఇంట్లో అద్దెకి ఉండేవారు. అప్పటికి ఆయనకి ఒక కూతురు, నా కన్నా సంవత్సరం పెద్దది. నన్ను వీధి చివరన ఉన్న ప్రకాశం మున్సిపల్ జూనియర్ బేసిక్ స్కూలులో జాయిన్ చెయ్యాలంటే అయిదు సంవత్సరాలు ఉండాలి కాబట్టి మాస్టారు నా వయస్సు ఎక్కువ వేసి జాయిన్ చేశారు. ఎప్పుడూ తెల్లని చొక్కా, పంచె కట్టుకుని ఉంగరాల జుట్టుతో గంభీరంగా ఉండేవారు. ఇంటి ప్రక్కనే ఉంటున్నా, ఆయన భార్యతో ఎంత చనువున్నా కూడా ఆయనంటే ఎంతో భయం వేసేది. నన్ను ఎప్పుడూ కోప్పడేవారు కాదు. కానీ మా అన్నయ్యని కానీ వేరే మగపిల్లలని కానీ 'రేయ్' అని గట్టిగా కేకవేస్తే నేను భయపడి పోయేదాన్ని. అంత స్ట్రిక్ట్‌గా కనిపించేవారు ఆయన. అలా ఆ స్కూలులో మాస్టారి గారి ఆధ్వర్యంలో ఆడుతూ పాడుతూ అయిదవ తరగతి పూర్తి చేశాను.

ఈ కాలక్రమంలో మాస్టారుగారికి మరో ముగ్గురు కూతుళ్ళు పుట్టారు. మాస్టారికి మగపిల్లవాడు కావాలని ఉండేదని ఆయన భార్య ద్వారా అమ్మకి, అమ్మ ద్వారా మాకు తెలిసింది. అప్పుడు తెలిసింది ఆర్థికభారం అయినా ఆయన నలుగురు ఆడపిల్లల్ని ఎందుకు కన్నారో. మాస్టారుగారు నేర్పింది అక్షరాలు, పదాలే కావచ్చు కానీ అవే నా భవిష్యత్తుకి పునాది రాళ్ళని ఘంటాపథంగా చెప్పగలను.

శ్రీరామ్మూర్తి మాస్టారు గారు మాతో సుమతీ శతకం, వేమన శతకం వల్లె వేయించేవారు, సాయంత్రం ప్రైవేట్ క్లాసులో. మమ్మల్ని ప్రైవేట్‌కి పంపటం అవసరం లేకపోయినా వాళ్ళకి కొంచెం ఆర్థికంగా సాయం చేసినట్లు ఉంటుందని అమ్మ నన్ను, మా

అన్నయ్యని మాస్టారుగారి దగ్గరకు పంపేది. మా ఇంటి పక్కనుంచి అదే వీధిలో వేరే ఇంటికి మారినా వాళ్ళ అమ్మాయితో ఆడుకోవటానికి వెళుతూ ఉండటం వల్ల మాస్టారుగారి కుటుంబంతో అనుబంధం నేను పదవ తరగతి పూర్తి చేసేవరకూ కొనసాగింది.

కాలక్రమేణా వాళ్ళు ఇల్లు మారుతూ ఉండటం, నేను వేరే ఊరు హాస్టల్‌కి వెళ్ళటంతో వాళ్ళ విషయాలు అమ్మ ద్వారా తెలుస్తూ ఉండేవి. ఖచ్చితంగా మాస్టారు గారు ఏ సంవత్సరంలో పోయారో గుర్తు లేదు కానీ సర్వీసులో ఉండగానే పోవటం వల్ల ఆయన ఉద్యోగం వాళ్ళ మూడో కూతురికి వచ్చినట్లు తెలిసింది. శ్రీరామ్మూర్తి మాస్టారుగారిని నేను ఎప్పటికీ మరిచిపోలేను.

ఆ తరువాత నేను చెప్పవలసింది ఉదయభాస్కర్ టీచర్‌గారి గురించి. ఆవిడ మాకు టీచ్ చేసింది పదవ తరగతి ఇంగ్లీష్ ఒక్కటే అయినా ఆవిడతో నా అనుబంధం అయిదు సంవత్సరాలు. ఎలాగంటే - నేను రేపల్లెలోని భగవాన్ శ్రీ సత్యసాయి హైస్కూలులో ఆరు నుంచి పదవ తరగతి వరకు చదివాను. స్కూలులో పుట్టపర్తి సాయిబాబా మా దైవం. ఉదయం టీచర్లు అందరినీ 'సాయిరాం టీచర్' అని గ్రీట్ చేసేవాళ్ళం. ప్రతి గురువారం సాయంత్రం స్కూల్ వదలబోయే గంట ముందు మోరల్ క్లాస్ ఉండేది. మేమందరం మళ్ళీ గురువారం ఎప్పుడు వస్తుందా అని శుక్రవారం నుంచే ఎదురుచూడటం మొదలు పెట్టేవాళ్ళం, ఎందుకంటే ఉదయభాస్కర్ టీచర్ మాకు మోరల్ క్లాసులో నీతికథలు చెప్పేవారు. అవి ఎంతో వినసొంపుగా చెప్పేవారు. 300 వందల మందికి పైగా ఉన్న మేము ఓపెన్ గ్రౌండ్‌లో మైకు లేకుండా కూడా ఆవిడ కథ వినగలిగే వాళ్ళం అంటే ఆ కథలు మమ్మల్ని ఎంత ఆకట్టుకున్నాయో మీరు ఊహించగలరు. అంత స్వచ్ఛంగా, ఆకట్టుకునేలా చెప్పేవారు ఆవిడ.

ఆ నీతి కథల ప్రహసనం మెల్లగా రామాయణం చెప్పటంగా రూపాంతరం చెందింది. నేను పదవ తరగతి అయిపోయి బయటకి వచ్చేసరికి రామాయణ కథనం కొనసాగుతూనే ఉంది. నాకు హైస్కూలు గుర్తు వస్తే మొట్టమొదట గుర్తువచ్చేది మా ఉదయ భాస్కర్ టీచరే. ఆవిడ ఇంగ్లీష్ టీచర్ కన్నా కూడా నీతి కథలు చెప్పే టీచర్ గానే గుర్తుండిపోయారు. అలా అని ఆవిడ సబ్జెక్ట్ మీద ఏ మాత్రం అశ్రద్ధ చూపేవారు కాదు. ఎలాగంటే.....

ఉదయ భాస్కర్ టీచర్‌గారు మా స్కూల్ కరస్పాండెంట్ గోపాలరావుగారి భార్య. వాళ్ళ ఇంటి దగ్గరలోనే వాళ్ళకి హైస్కూల్ కాక ఒక కాన్వెంట్ ఉండేది. మేము పదవ తరగతిలో ఉండగా డిసెంబర్ మొదలుకుని మార్చిలో పరీక్షలు అయ్యేవరకు మాకు స్పెషల్ క్లాసులు ఉండేవి. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి పదిగంటలవరకు ఈ కాన్వెంటులో పర్యవేక్షణ అంతా ఉదయభాస్కర్ టీచర్ గారిదే రాత్రి పదిగంటలకి ఇంటికి వెళ్ళలేని వారికి అక్కడే పడుకునే వాళ్ళం. ఎందుకంటే ఇక్కడే ఉంటే ఉదయం 5 గంటలకే చదువుకోవడానికి టీచరుగారు లేపేవారు. 5 గంటలనుంచి 6 గంటలవరకు చదువుకుని అప్పుడు ఇళ్ళకు వెళ్ళేవాళ్ళం. నిజంగా ఆవిడ స్కూల్ కోసం, మాకోసం చేసిన నిస్వార్థ సేవ మరిచిపోలేనిది. వాళ్ళ అమ్మాయి సాయిలత మెడిసిన్, అబ్బాయి గిరిధర్ ఎం.బి.ఎ చేశారని తెలిసింది. స్కూలు వదిలేసిన తరువాత టీచర్‌గారిని ఒకటి రెండు సార్లు మాత్రం కలవగలిగే అవకాశం



వచ్చింది నాకు.

నేను భీమ్లిలో గవర్నమెంట్ పాలిటెక్నినిక్ ఫర్ ఉమెన్ లో ఎల్రక్టానిక్స్ అండ్ కమ్యునికేషన్స్ బ్రాంచ్ లో జాయిన్ అయినప్పుడు ఆ డిపార్ట్మెంట్ హెడ్ శ్యామ సుందరరాజుగారే మా హాస్టల్ వార్డెన్గా ఉండేవారు. ఆయన మా అమ్మాయిలందరికీ తండ్రిలాగే వ్యవహరించేవారు. కాలేజ్ అవర్స్ అయిపోయాక మమ్మల్ని షాపింగ్ కి తీసుకెళ్ళినా, సినిమాకి తీసుకెళ్ళినా, బీచ్‌కి తీసుకెళ్ళినా ఎల్లప్పుడూ మా వెంటే ఉండి మా సేఫ్టీ గురించే ఆలోచించేవారు. హోం సిక్‌తో ఏడుస్తున్న అమ్మాయిలకి జోక్స్ చెప్పి నవ్వించేవారు. తను అంతకు ముందు పనిచేసిన కాలేజ్‌లో విషయాలు చెప్పి మమ్మల్ని ఎంకరేజ్ చేసేవారు.




తరువాత ఆయన వ్యక్తిగత కారణాల వలన హాస్టల్ వార్డెన్గా విరమించుకున్నప్పుడు మేమందరం ఎంత బాధపడ్డామో నాకిప్పటికీ కళ్ళకి కట్టినట్లుగానే ఉంది. కాకపోతే వెంటనే రత్నకుమారి టీచర్ ఆయన బాధ్యతల్ని చేపట్టి అతి తక్కువ సమయంలోనే మమ్మల్నందరినీ మళ్ళీ నవ్వించగలిగారు. ఆవిడ వయస్సులో మాకంటే నాలుగైదు సంవత్సరాలు పెద్ద అంతే. అందుకే మాలో ఒకరిగా కలిసిపోగలిగారు. మాతోపాటే హాస్టల్‌లో ఉంటూ మాతో ఫ్రెండ్‌లా ఉండేవారు. హాస్టల్ దాటి క్లాసులోకి వెళ్ళగానే ఆవిడ లెక్చరర్, మేము స్టూడెంట్స్. మూడు సంవత్సరాలు హాస్టల్లో ఫ్యామిలీస్‌కి దూరంగా ఉన్నాకానీ ఈ ఇద్దరి టీచర్ల వల్ల మేము చదువు మీద దృష్టి పెట్టగలిగాము.

వైజాగ్ లోని ఆంధ్రా యూనివర్శిటీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో (1989 - 1993) నాకు గుర్తున్న ఒకే ఒక్క లెక్చరర్ ఎల్రక్టానిక్స్ డిపార్ట్మెంట్ హెడ్ రాజుగారు. ఆయన చాలా సీరియస్‌గా ఉండేవారు కానీ చాలా బాగా టీచ్ చేసేవారు. సబ్జెక్ట్ మీద మంచి కమాండ్ ఉండేది. మా ప్రాజెక్ట్‌కి కూడా ఆయనే గైడ్‌గా ఉండి పూర్తి చేయించారు.

ఈ మహానుభావులందరికీ నావందనాలు అర్పించుకునే అవకాశం కలిగించిన కౌముదికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.



సుధగారు న్యూయర్క్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేస్తున్నారు. తెలుగు సాహిత్యం అంటే చాలా ఇష్టం. భర్తా, కుమార్తెలతో న్యూజెర్సీలో నివాసం.